

పసుపు బోర్డుతో రైతుల జీవితాల్లో వెలుగులు 7
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
స్వశక్తి సంఘాల సభ్యులకు బీమా 8
బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు 8









మినట్ టు మినట్

సోమవారం రాత్రి 8.00: హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు, కరీంనగర్‌కు తరలింపు

రాత్రి 8.30: కరీంనగర్ వన్‌టౌన్ వద్దకు భారీగా చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

రాత్రి 9.00: నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాత్రి 10.40: కౌశిక్‌రెడ్డితో కరీంనగర్ సీపీటీసీకి చేరుకున్న పోలీసులు
రాత్రి 11.45: కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ త్రీటౌన్‌కు తరలించిన పోలీసులు

రాత్రి 12. 45: బీఆర్ఎస్ లీగల్ టీంను స్టేషన్‌లోకి అనుమతించిన పోలీసులు
రాత్రి 1.35: త్రీ టౌన్ నుంచి బయటకు వచ్చిన బీఆర్ఎస్ లీగల్ టీం..

మంగళవారం ఉదయం 8.30: కరీంనగర్ రెండో అదనపు మెజిస్ట్రేట్ ఎం హేమలత ఎదుట హాజరు పరిచిన పోలీసులు

ఉదయం 10.00: బెయిల్ మంజూరు కావడంతో బయటకు వచ్చిన కౌశిక్‌రెడ్డి

హైడ్రామాకు తెర

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్

పూచీకత్తు సమర్పించిన అనంతరం విడుదల

రెండు రోజుల ఉత్కంఠకు తెరపడింది. ఆదివారం ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో జరిగిన వాగ్వాదం, గొడవ కేసుల వరకు వెళ్లింది. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కరీంనగర్ ఆర్డీవో కె మహేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం ఫిర్యాదు మేరకు పోలీసులు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై సోమవారం రెండు కేసులు నమోదు చేశారు. అదే రోజు రాత్రి పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి కరీంనగర్‌కు తరలించారు. రాత్రంతా త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచి మంగళవారం ఉదయం మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాత మెజిస్ట్రేట్ కౌశిక్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. దీంతో ఆయన హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. - కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి

6లో



ఉదయం: 10.20: కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడి హైదరాబాద్‌కు పయనమైన కౌశిక్‌రెడ్డి

'సంక్షేమ' సర్వేలను పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఈ 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియను పాదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆమె జిల్లా ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం విధివిధానాలు జారీ చేసిందన్నారు. పథకాల అమలుపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం జరుగుతుందని చెప్పారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

రైతు భరోసా కింద ప్రభుత్వం వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరాకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వనుందని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. గురువారం నుంచి సర్వే ప్రారంభించి ఈనెల 20లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. 21 నుంచి గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వ హణకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉండి భూమిలేక గత సంవత్సరం కనీసం 20 రోజులు ఉపాధిహామీ పనులు చేసిన వారు ఆత్మీయభరోసా పథకానికి అర్హులని చెప్పారు. లబ్ధిదారులకు జాబ్‌కార్డు లో భూమి ఉండకూడదని చెప్పారు.

ఈ పథకం సర్వేను ఈనెల 18 లోగా పూర్తి చేసి, 20న చేపట్టే గ్రామసభల్లో ప్రజల ముందు ఉంచాలని చెప్పారు. కొత్త రేషన్‌కార్డుల జారీకి మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ధ్రువీకరణ బాధ్యత ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం నుంచి జారీ చేసిన ఫార్మాట్‌లో సర్వే నివేదిక సమర్పించాలని అన్నారు. ప్రతి దశలో ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పకుండా పాటించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, ఆర్డీవోలు మహేశ్, రమేశ్, మున్సిపల్ పాల్గొన్నారు.

19న వెయ్యి గొంతులు, లక్ష డప్పుల సన్నాహక సదస్సు

హాజరు కానున్న మంద కృష్ణమాదిగ

సుభాష్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వెయ్యి గొంతులు, లక్ష డప్పుల సన్నాహక సదస్సును ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ తెలిపారు. నగరంలోని ప్రెస్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రతి మండలం నుంచి వేలాది మంది డప్పులతో కదలిరావాలని, అందుకు నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బొయిని కొము రయ్య, తడగొండ శంకర్, దోమకొండ శ్రీనివాస్, చెంచాల నవీన్, కాద మల్లయ్య, బెజ్జంకి నరేష్, గంగాధర రఘు, అలువాల సంపత్, కల్లెడ కొమురయ్య, ఎలగందుల కుమార్, దోమకొండ గోపి, కనకుంట్ల శ్రీని వాస్, కోడూరి మహేశ్, కలకోట సమ్మాయి, నక్క మల్లేశం, రాజేందర్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

జిల్లా అంతటా పండగ శోభ




విశేషాలంకరణలో అయ్యప్ప స్వామి, పడిపూజలో పాల్గొన్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజలు నూతన వస్త్రాలు ధరించి దైవ సందర్శనం చేసి పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. పిండి వంటలతోపాటు ప్రత్యేక విందులు, వినోదాల్లో మునిగి తేలారు. సాయంత్రం పిల్లలకు భోగి పండ్లు పోయగా మహిళలు, యువతులు, నోములు పంచుకొని వాయినాలు ఇచ్చుకున్నారు. వాడవాడలా సంక్రాంతి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోగా జనం స్వగ్రామాలకు తరలి వెళ్లడంతో పలు వీధులు బోసిపోయి కన్పించాయి. ఆలయాల్లో ఇంటిల్లి పాది అర్చనలు జరిపించుకున్నారు. అన్ని రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామాల్లో ప్రజలు వైభవంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించుకున్నారు. రాంపూర్ గిద్దెపెరుమాళ్ల ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, హాస్య నటుడు బ్రహ్మానందంతో పాటు కుటుంబ సభ్యులు, పలువురు కార్పోరేటర్లు, ఈవో ఎండపెల్లి మారుతి పూజల్లో పాల్గొన్నారు. రైతులు తమ పశువులను, ఎడ్ల బండ్లను తీసుకవచ్చి అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు.



గిద్దెపెరుమాళ్ల ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్

- మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయంలో జరిగిన పూజల్లో నటుడు బ్రహ్మానందం, కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో కందుల సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.
- ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మేయర్ క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు, డివిజన్ వాసులకు గాలిపటాలను మేయర్ యాదగిరి సునీల్‌రావు పంపిణీ చేశారు. ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ సభ్యులు నరేందర్, విద్యాసాగర్, హమీద్, మహేందర్ పాల్గొన్నారు.



చిన్నారులకు పతంగులు అందజేస్తున్న మేయర్ సునీల్‌రావు

కన్నుల పండువగా కనుమ

బుధవారం రైతుల ప్రత్యేక పండుగ కనుమను కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో రైతులు పశువులను అలంకరించి పొలాల వద్ద పూజలు చేశారు. పశువులకు అలంకరణలు చేసి పూజలు జరిపి పైరు పంటలను, పిల్లా పాపలను చల్లగా కాపాడుమంటూ వేడుకున్నారు. జనం ఆలయాల్లో అర్చనలు జరిపి సంవత్సరమంతా సుఖశాంతులతో సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి మిత్రులు, బంధువులను, పిల్లలను ఆహ్వానించి వేడుక జరిపారు. మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నోములు పంచుతూ, స్వీకరిస్తూ సందడిగా గడిపారు.

వైభవంగా మకరవిళక్కు పడిపూజలు

కరీంనగర్ జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం శబరిమల ఆచారం ప్రకారం మకరవిళక్కు పడిపూజలను నిర్వహించారు. ఉదయం మూల విరాట్టుకు ఫలరస పంచామృతాభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో మహా పాదయాత్ర చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గడప నాగరాజు గురుస్వామి, ఆలయ చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్, ధర్మకర్తలు, డి సంపత్, రుద్రాక్ష కృష్ణ, దాడి సంపత్, బండారి శ్రావణ్, గడప కోటేశ్, విష్ణుమూర్తి, సత్యనారాయణ, అన్నాడి మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



గిద్దెపెరుమాళ్ల ఆలయంలో సినీ నటుడు బ్రహ్మానందం

19న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలను ఈనెల 19న నిర్వహించనున్నారు. జిల్లాలోని హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సీహెచ్ అమిత్‌కుమార్, బి మల్లేశ్ గౌడ్ తెలిపారు.55కిలోల లోపు బరువు, 16 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తే లైసెన్స్ రద్దు

డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి



మాట్లాడుతున్న డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి

తిమ్మాపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే వారు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని, రాష్ డ్రైవింగ్ చేస్తే వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ శ్రీకాంత్ చక్రవర్తి హెచ్చరించారు. మండల కేం ద్రంలోని ఆర్టీవో ఆడిటోరియంలో లైసె న్సుల కోసం కార్యాలయానికి వచ్చిన వారికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి మాట్లాడుతూ వాహనాలను ఏకాగ్రతతో నడపాలన్నారు. ఎంవీఐ రవికుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ స్రవంతి, హరితయాదవ్ పాల్గొన్నారు.

మైనారిటీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్

గణేశ్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఫౌండేషన్ కోర్సు ఉచితంగా ఇస్తోందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి పి పవన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో ఫిబ్రవరి 15లోగా సమర్పించాలన్నారు. వివరాలకు 0878-2957085 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెస్సార్ సేవలు చిరస్మరణీయం

మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్‌అర్బన్,జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎం సత్యనారాయణరావు సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎం సత్యనారాయణరావ జయంతిని కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెస్సార్ చిన్న గ్రామం నుంచి వచ్చి ఇందిరాగాంధీ లాంటి మహా నాయకురాలితో సత్సంబంధాలు కలిగి ఉండే స్థాయికి ఎదిగారన్నారు.

నగరంలోని ఇందిరాచౌక్ దగ్గర ఎమ్మెస్సార్ జయంతి సందర్భంగా సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, పీసీసీ అధికార ప్రతినిధి, ఎమ్మెస్సార్ మనవడు మేనేని రోహిత్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి పాల్గొన్నారు.





ఎం సత్యనారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

'ఉద్యోగుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి'

కరీంనగర్ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు గెజిటెడ్ నాన్ గెజిటెడ్ ఉపాధ్యాయులు, పెన్షనర్ల, కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ముజాహిద్ హుస్సేన్ కోరారు. ఆయన బుధవారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్సీ నివేదికను తెప్పించుకొని జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వేసిన మంత్రుల సబ్‌కమిటీ వెంటనే ఉద్యో గ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ఆలయాల్లో చోరీ

కోరుట్ల/కోరుట్ల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలోని ఆలయాల్లో చోరీ జరిగినట్లు గ్రామస్థులు స్థానికులు తెలిపారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి, యూసుఫ్‌నగర్ ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగినట్లు వారు తెలిపారు. ఆలయాల్లో ఉన్న హుండీలను పగులగొట్టి నగదు అపహరించినట్లు తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో హుండీ పగుల గొట్టే పయత్నం చేసినప్పటికీ లాభం లేకపోవడంతో అందుబాటులో ఉన్న సుమారు రూ. 2000 రూపాయలను ఎత్తుకెళ్లినట్లు నిర్వహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి బంగారు అభరణం ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై నరేశ్‌కుమార్

మల్యాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాలకు చెందిన మ్యాక మంజుల అనే మహిళ ఇంట్లో ఈ నెల 4న రాత్రి దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గమనించిన గ్రామానికి చెందిన మ్యాక మహేశ్, కుంద బాబు అనే ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి దూరి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం వారిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుబడిన నిందితుల వద్ద మూడున్నర తులాల బంగారం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

అర్ధరాత్రి రెండు చోట్ల ఘర్షణ

వేములవాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత రెండు చోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నాయి. న్యూ అర్బన్ కాలనీలో ఇద్దరు యువకుల మధ్య మాట మాట పెరిగి గొడవకు దారితీసింది. దీంతో వారు ఒకరిపై ఒకరి దాడి చేసుకోవడంతో పోలీసులు చేరుకొని దాడికి పాల్పడుతున్న వారిని చెల్లాచెదురు చేశారు. భగవంతరావునగర్‌లోని తాటికొండ రాజయ్య ఫంక్షన్ హాల్ వద్ద బుధవారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా ఇద్దరు యువకులపై కాలనీ యువకులు దాడి చేశారు. తాము గుడికి వెళ్తున్నామని చెప్పినప్పటికీ కాలనీవాసులోని తమపై దాడి చేశారని బాధితులు వాపోయారు. ఈ దాడిలో ఒకరి పరిస్థితి విషమంగా మారడంతో అతడిని పోలీసులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పట్టణ సిఐ వీరప్రసాద్ తెలిపారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

సుల్తానాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ మండలం సుద్దాల ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వలస కార్మికుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతిచెందినట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం, మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బాలంగీర్ జిల్లా జింకదుంగిరి మండలం లాపెర్ గ్రామానికి చెందిన పరిక్షిత్ మహకూర్(35)వారం క్రితం సుద్దాల లక్ష్మీగణపతి బ్రిక్స్ కంపెనీలో కూలీ పనికి వచ్చాడు. మంగళవారం ఉదయం బట్టీలో మట్టి గడ్డపైకి ట్రాక్టర్ ఎక్కించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ పరీక్షిత్ మహాకర్ ట్రాక్టర్ కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి



బాలయ్య(ఫైల్)

సైదాపూర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామానికి చెందిన పరుష బాలయ్య(108) అనే శతాధిక వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడని తెలిపారు. ఇతను వంద సంవత్సరాలకు పైగా జీవించినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, మనుమలు, మనుమరాళ్లున్నారు.

వివాహిత ఆత్మహత్య

వేములవాడ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంతానం కావడం లేదని మానసిక వేదనకు గురై వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన బత్తుల రాజవ్వ (22)కు రెండు సంవత్సరాల క్రితం రాములుతో వివాహం జరిగింది. దంపతులు కూలి పని చేసుకుంటూ వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన నాంపల్లి శివారులో గుడారం వేసుకుని జీవిస్తున్నారు. సంతానం కాకపోవడంతో మానసిక వేదనకు గురైన రాజవ్వ బుధవారం గుడారంలోని పైకట్టెకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కళ తప్పిన సాహితీ 'ఖని'

- పారిశ్రామిక ప్రాంతాన్ని 'వీడిన' కవులు, రచయితలు, కళాకారులు
- వెలవెలబోతున్న నల్లబంగారు నేల..

గోదావరిఖని, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్ ప్రాంత జీవితాలను ప్రపంచానికి పరిచయం చేసిన సాహితీకారులు నేడు ఈ ప్రాంతాన్ని వీడి వెళ్లిపోయారు. కోల్‌బెల్ట్‌లో నెలకొన్న వివిధ పరిశ్రమలలో ఉపాధి కోసం వచ్చిన కొందరు, ఇక్కడి చైతన్యపూరిత ఉద్యమాలతో ప్రేరణ పొందిన మరికొందరు తమ కథలు, నవలలు, పాటలు, గేయాలు వంటి రచనలతో ఇక్కడి స్థితిగతులను అక్షరబద్ధం చేశారు. ఈప్రాంతంలో పారిశ్రామిక ప్రగతి మందగించినట్లే సాహిత్య కార్యక్రమాలు తగ్గిపోయాయి. కలం యోధులు కొంద రు కన్నుమూయగా, మరికొందరు ఈ ప్రాంతాన్ని వీడి వెళ్లిపో యారు. దీంతో రామగుండం సాహితీ గొంతుక మూగబోయింది.. సదస్సులు, కవి సమ్మేళనాలు, పుస్తకా విష్కరణలు లాంటి ప్రక్రియలు కనుమరుగ య్యాయి. ఇక్కడి ప్రజలు, కార్మిక లోకం, పల్లెలు, పరాయీకరణ, శ్రమదోపిడీ, విప్లవాలు, ఉద్యమాలు.. ఇవన్నింటిని ఔపోసన పట్టి హృద్యంగా కవిత్వాలు రాసి.. పాటలు అల్లే కవులందరూ పాలపిట్టల్లా ఎగిరి పోయారు. నిత్యం చైతన్యంతో అలరారిన ఈప్రాంత సాహిత్యం దశాబ్ద కాలంగా అచేతనమైంది.

సదాశివుడు...



'తలాపున పారుతుంది గోదావరి.. నీ చేను, నీ చెలుక ఎడారి' అని తెలంగాణ జల దోపిడీని ఒక్క పాటతో వివరించిన సదాశివుడు కన్నుమూశారు. అనేక ఉద్యమా లతో పాటు ఊళ్లను విడిచి పెడుతున్న యువకుల పరిస్థితులను తన పాటలతో ప్రపంచానికి చూపించిన సదాశివుడి మరణం కూడా ఈ ప్రాంత సాహిత్యానికి లోటు అయ్యింది. చేతన సాహితి సాంస్కృతిక వేదికగా అనేక సాహితీ సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించే సదాశివుడి నిష్క్రమణతో ఆ ప్రక్రియ ఇక్కడ క్రమంగా తగ్గిపోయింది.

రఘోత్తమ్‌రెడ్డి



బొగ్గు గని కార్మికుల కష్టాలు, కన్నీళ్లు, బాయి దొరల మర్మాలను అక్షరబద్ధం చేసిన.. 'నల్ల వజ్రం' లాంటి నవలలు రాసిన తుమ్మేటి రఘోత్తమ్‌రెడ్డి సింగరేణిలో పదవీవిరమణ తరువాత ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. గని కార్మికుల జీవితాలను, పనిపిల్లల బతుకుల ఇతివృత్తంగా ఆయన రాసిన సాహిత్యం గొప్ప స్థాయికి ఎదిగింది. రఘోత్తమరెడ్డి వెళ్లిపోవడం కూడా ఇక్కడి సాహితీ రంగానికి లోటుగా మారింది.

కాలువ మల్లయ్య



రామగుండం ఎరువుల కర్మాగారానికి ఉద్యోగ రీత్యా వచ్చిన కాలువ మల్లయ్య ఫ్యాక్టరీ మూతపడడంతో ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. కథలు, నవలలు, వ్యాసాంగం తదితర ప్రక్రియలో చేయి తిరిగి ఆయన తెలంగాణ సామాజిక, గ్రామీణ జీవితంతో పాటు రాజకీయ అంశాల్లో కూడా రచనలు కొనసాగించారు. మాదిగ విజయం, అస్పృష్య యోధుడు లాంటి అనేక పుస్తకాలు కాలువ మల్లయ్య కలం నుంచి జాలువారాయి.

చందు



సింగరేణిలో ఉద్యోగానికి వచ్చిన చందు (కలం పేరు యాదగిరి) ఇక్కడి విప్లవోద్యమాలను 'శేషగిరి' నవల ద్వారా అక్షరబద్ధం చేశారు. నేను రాజపోషవ్వను మాట్లాడుతున్నా.. అంటూ ఒక పర్యావరణ అభిప్రాయ సేకరణలో తమ బాధల్ని చెప్పుకున్న ఓ గ్రామీణ మహిళ ఆవేదనను అక్షర బద్ధం చేసి సాహిత్యంలో ఒక కొత్త ప్రక్రియను ఆవిష్కరించారు. అనేక పుస్తకాలు, నవలలు రాసిన చందు తన సాహితీ ప్రక్రియను కొనసాగిస్తున్నప్పటికీ ఈప్రాంతానికి దూరమయ్యారు.

వజ్జల శివకుమార్



ఎఫ్‌సీఐ కేంద్రీయ విద్యాలయంలో లైబ్రేరియన్‌గా చేరిన శివకుమార్ ఇక్కడి ప్రముఖ కవుల్లో ఒకరు. కవిత్వాన్ని నిత్య సృజనగా భావిస్తూ ఔత్సాహికుల్ని సాహిత్యం వైపు మళ్లించిన ఆయన ఎఫ్‌సీఐ మూసివేత అనంతరం ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ప్రాంతంలో సాహిత్య వాతావరణాన్ని ఆయన సుసంపన్నం చేశారు. 1985 నుంచి రెండు దశబ్దాల కాలం ఇక్కడ ఉన్న వజ్జల 'ఫెర్టిలైజర్ సిటీ సాహితి సమాఖ్య' ఏర్పాటు చేశారు. చాలా మంది యువ కవులు ఈ సమాఖ్య నుంచి వెలుగులోకి వచ్చారు. గోగుపువ్వు, దాఖలా, పాల కంకుల కళ లాంటి అనేక కవిత సంపుటిలు రాసిన శివకుమార్ వెళ్లిపోవడంతో ఇక్కడి సాహిత్యం వెలవెలబోయింది.

జాకబ్...



ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శిగా, పాటకు నిలువెత్తు రూపంగా సీహెచ్ జాకబ్ నిలిచారు. సాహిత్యకారుడిగానే కాకుండా విద్యార్థి ఉద్యమాల నుంచి అనేక కార్మిక పోరాటాల్లో పాలుపంచుకున్నారు. రచయితగా, గాయకుడిగా నటుడిగా అనేక కళా రూపాలకు ప్రతినిధిగా కోల్‌బెల్ట్ ప్రాంతాన్ని కలియతిరిగిన జాకబ్ మరణం ఇక్కడి అభ్యుదయ సాంస్కృతిక వాతావరణాన్ని దెబ్బతీసింది. కోల్ ఇండియాలో సింగరేణి సంస్థకు సాంస్కృతిక రంగాల్లో ప్రధానంగా గజల్ ప్రక్రియలో అనేక బంగారు పతకాలను గెలుచుకొచ్చిన జాకబ్ లేకపోవడం లోటుగా మారింది.

ఇప్పటికీ మొదటినుంచి సాహిత్య సృజన కొనసాగిస్తున్న అసరం నాయకుడు, కవి వేల్పుల నారాయణ, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, శ్రీదాస్యం లక్ష్మయ్య లాంటి వారు కవిత్వాలు రాస్తూనే ఉన్నారు. గౌరోజు అనుశ్రీలాంటి వర్ధమాన కవులు ఇప్పుడిప్పుడు వాసికి ఎక్కుతున్నారు. పాటలను పరుగులు తొక్కించి దయానర్సింగ్ సాహిత్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. కానీ ఇక్కడి సాహితీ మూర్తులను ఒక్క చోటకు తీసుకువచ్చే నిర్వాహక వేదిక లేకపోవడం పెద్ద లోటు.

యువకుల వీరంగం

- నలుగురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు

గన్నేరువరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పండగ పూట యువకులు వీరంగం సృష్టించి హంగామా చేసిన సంఘటన మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాంబయపల్లి గ్రామానికి చెందిన గడ్డం మహేందర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన తన స్నేహితులు అనిల్‌రెడ్డి, అనంతరెడ్డి, తిరుపతిరెడ్డిలు కలిసి కారులో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ మంగళవారం రాత్రి మైలారంలోని ఎస్సీ కాలనీ నుండి వెళుతుండగా కాలనీవాసులు కారును ఆపి వారిని మందలించారు. దీంతో కోపంతో మద్యం మత్తులో ఊగిపోయిన మహేందర్‌రెడ్డి తన స్నేహితులు కాలనీవాసులను కులం పేరుతో దూషించి బండరాయిలతో దాడి చేయడంతో 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వీరంగం సృష్టించిన యువకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్సీ కాలనీకి చెందిన జక్కనపల్లి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

ధర్మపురి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన నక్క విజయ్‌కుమార్ (30) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్‌కుమార్ జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లి వస్తుంటాడు. పోలాండ్ దేశంలో ఉన్నప్పుడు తన స్నేహితులకు డబ్బు ఇచ్చాడు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందిన విజయ్‌కుమార్ ఈ నెల 12న తన పత్తి చేనులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మొదట ధర్మపురి ఆసుపత్రికి అక్కడి నుంచి జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి నక్క నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- అల్లుడే చంపాడంటూ అత్త ఫిర్యాదు

మెట్‌పల్లిటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందింది. ఏఎస్ఐ అంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామానికి చెందిన బోగవల్లి సుదీక్ష (23) అనే యువతి అదే జిల్లా నవీపేట మండలానికి చెందిన బోగవల్లి జానీ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లైన సంవత్సరం నుంచి జానీ అతని కుటుంబ సభ్యులు సుదీక్షను మానసికంగా, శారీరకంగా వేధించారు. పలుమార్లు నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో, పెద్ద మనుషులో సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి కాపురానికి పంపారు. వీరు రెండు సంవత్సరాలుగా ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. జానీ హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేయగా, భార్య కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వారు అద్దెకు ఉంటున్న ఇంట్లో సుదీక్ష ఉరికి వేళాడుతూ కనిపించింది. అల్లుడు జానీ ఉరి వేసి చంపాడని అత్త లింగంపల్లి కళావతి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రాములు, తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీల పట్టివేత

కోరుట్ల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం మెహన్‌రావుపేట గ్రామ శివారులోని వల్లంపల్లి చౌరస్తాలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను మంగళవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మోహన్‌రావుపేట గ్రామంలోని జాతీయ రహదారి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారి రాజేందర్‌రావు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మెట్‌పల్లి, నిజామాబాద్ జిల్లాలో పలు గ్రామాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారి తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ఒకరి అరెస్టు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్ శివారులో గల మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన కుండెన సాయి శరత్ (27) అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్‌చేశామని టౌన్ సిఐ కె.కృష్ణ తెలిపారు. మానేరు వాగు నుంచి టిఎస్ 23 టి 7833 నెంబర్ గల ట్రాక్టర్ ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను వదలి పారిపోయాడని ఆయన తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సాయి శరత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.



రెవెన్యూ అధికారులు పట్టుకున్న లారీలు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు ప్రసారం చేస్తున్నారని

యూట్యూబ్ చానల్‌పై ఫిర్యాదు

మల్యాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చే విధంగా అనుచిత వ్యాఖ్యలు ప్రసారం చేశారని ఆరోపిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓ యూట్యూబ్ చానల్‌పై మల్యాల పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని ఎస్సై నరేశ్‌కుమార్‌కు ఫిర్యాదులో కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై అనుచిత సమాచారం ప్రచారం చేస్తే ఊరుకునేది లేదన్నారు. అలాంటి యూట్యూబ్ చానెళ్లపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. మల్యాల పట్టణ అధ్యక్షుడు కట్కం వినయ్, జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, మేకల ప్రశాంత్, కోరెపు వెంకటేష్, సంత ప్రకాష్‌రెడ్డి, గుర్రం శ్రీకాంత్, సాయికుమార్, శ్రీను పాల్గొన్నారు.

హైడ్రామాకు తెర

- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్
- పూచీకత్తు సమర్పించిన అనంతరం విడుదల

కరీంనగర్ క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు వ్యవహారంలో హైడ్రామాకు తెరపడింది. మెజిస్ట్రేట్ ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో జగిత్యాల శాసన సభ్యుడు సంజయ్‌కుమార్ మాట్లాడుతుండగా హుజూరాబాద్ శాసన సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడిన తీరు, వాడిన పదజాలంగలాటాకు దారి తీసింది.

రెండు కేసులు నమోదు..

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ జగిత్యాల శాసన సభ్యుడు శాసన సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. సంజయ్‌కుమార్‌ను సమావేశంలో మాట్లాడకుండా అడ్డకోవడంతో పాటు చేయిచేసుకుని అవమానించారని ఆయన పీఏ కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై కరీంనగర్ ఆర్డీవో కె మహేశ్వర్, సమావేశానికి హాజరవుతున్న సమయంలో పాడి కౌశిక్‌రెడ్డి తనను దుర్భాషలాడుతూ అడ్డుకోవడంతోపాటు కాలర్ పట్టుకుని అవమానపరిచాడని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. సంజయ్‌కుమార్‌తో పాటు మరికొందరు ఎమ్మెల్యేల వాంగ్మూలాలను ఈ సంఘటనకు సాక్ష్యాలుగా పోలీసులు సోమవారం సేకరించారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తరలించారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కరీంనగర్‌కు తీసుకువస్తున్నారనే విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులతో పాటు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కరీంనగర్ ఒకటొ ఠాణా వద్దకు చేరుకున్నారు.



మెజిస్ట్రేట్ వద్దకు వెళ్తున్న కౌశిక్‌రెడ్డి

సీపీటీసీకి.. త్రీ టౌన్‌కు.. మెజిస్ట్రేట్ ఎదుటకు..

కౌశిక్‌రెడ్డిని పోలీసులు మొదట కరీంనగర్ సీపీటీసీకి అనంతరం మూడో ఠాణాకు తరలించి అక్కడే రాత్రంతా అక్కడే ఉంచారు. సోమవారం ఉదయం 8:30 గంటల సమయంలో కరీంనగర్ రెండో అదనపు మెజిస్ట్రేట్ ఎం హేమలత ఎదుట హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ వద్ద ఎమ్మెల్యే తరఫున బీఆర్‌ఎస్ లీగల్‌టీం, న్యాయవాది ఇ మధుసూదన్ రావు, సర్దార్ రవీందర్‌సింగ్ మరో ఇద్దరు వాదనలు వినిపించారు. పోలీసుల తరఫున ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గంటకుపైగా తమ వాదనలు వినిపించారు. చివరకు కౌశిక్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి మీడియా సమావేశం నిర్వహించవద్దని, రెండు కేసుల్లో 50 వేల రూపాయల చొప్పున పూచీకత్తులు సమర్పించాల న్నారు. పోలీసులు పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. లక్ష రూపాయల పూచీకత్తులు సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు విడుదల చేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని అక్కడి నుంచి హైదరా బాద్‌కు వెళ్లిపోయారు. ఈ సందర్భంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను గౌరవి స్తానని, తాను మీడియా సమావేశంలో మాట్లాడరాద న్నారు. పండగపూట రాజకీయాలు మాట్లాడకూడ దనుకున్నట్లు తెలిపారు. తనకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.



మెజిస్ట్రేట్ ఇంటివద్ద పోలీసు బందోబస్తు

పిచ్చి కుక్కల స్వైర విహారం



కుక్కల దాడిలో గాయపడిన వ్యక్తులు

కోల్‌సిటీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రెండు రోజులుగా నగర పరిధిలోని వివిధ కాలనీల్లో ప్రజలపై దాడి చేసిన ఘటనల్లో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం సంక్రాంతి పండుగ రోజున స్థానిక బాపూజీనగర్‌కు చెందిన ప్రసాద్(23)పై దాడి చేసి ముక్కును కొరికాయి. దీంతో అతన్ని కరీంనగర్‌కు తరలించారు. స్థానిక కళ్యాణ్‌నగర్, మేకల మార్కెట్, అడ్డగుంటపల్లి, తిరుమల్‌నగర్, ఊర్వశి థియే టర్ ప్రాంతాల్లో ఆరుగురిపై దాడి చేశాయి. కాంగ్రెస్ నాయకుడు చిదురాల రవీందర్‌తో పాటు పదేళ్ల పాప వేదశ్రీతో పాటు స్వరూప, అయాన్ష్ వర్ధన్, సమ్మయ్య, శ్రీనివాస్‌లపై దాడి చేశాయి. వీరిని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, ఇతరులు పరామర్శించారు. కాగా ఈ రెండు రోజులుగా కార్పొరేషన్ పరిధిలో పిచ్చి కుక్కలు స్వైర విహా రం చేస్తూ దాడులు చేస్తున్నా నగరపాలక యంత్రాంగం స్పందించడం లేదు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మొకిడె సాయికుమార్ (49) సోమవారం రాత్రి మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్ కాపువాడకు చెందిన సాయికుమార్ ఈ నెల 5న కమాన్ నుంచి కోతిరాంపూర్ వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. సాయికుమార్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

సిరిసిల్ల క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కెమ్మసరం సురేష్ (41)ను బుధవారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని సిద్ధార్థనగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్న ఆర్టీసీ కండక్టర్ ఎడపల్లి శ్రీనివాస్ తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 11న స్వగ్రామమైన బోయిన్‌పల్లి మండలంలోని తడగొండకు వెళ్లాడు. అదే రోజు రాత్రి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రెండు తులాల ఆభరణాలు, రూ. 70 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఈ విషయాన్ని ఇంటి యజమాని గమనించి చోరీ జరిగిందని శ్రీనివాస్‌కు చెప్పాడు. తడగొండలో ఉన్న శ్రీనివాస్ ఈ నెల 12న సిరిసిల్లకు వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి దొంగలు చొరబడి నగదు, ఆభరణాలు చోరీ గురైనట్లు గమనించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో సురేష్‌ను పట్టుకొని విచారించగా దొంగతనం చేశానని అంగీకరించాడని, రిమాండ్‌కు తరలించామని సీఐ కృష్ణ తెలిపారు.

కురుమలు రాజకీయంగా ఎదగాలి

గంగాధర, ఆంధ్రజ్యోతి 15 (ఆంధ్రజ్యోతి): కురుమలు రాజకీయంగా ఎదగాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు అయిలయ్య అన్నారు. బుధవారం మండలంలోని ర్యాలపల్లి పరిధి కురుమపల్లెకు వచ్చిన సందర్భంగా ఆయనను మండల కురుమ సంఘ నాయకులు సన్మానించారు.

వాహన తనిఖీల్లో 12 మంది బాలుర పట్టివేత

కరీంనగర్ క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్, ఆర్‌ఐ స్వామి ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించి వాహనాలు నడుపుతున్న 12 మంది బాలురను పట్టుకున్నారు. వాహనాలను సీజ్ చేశారు. వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానా విధించారు.

చాపకింద నీరులా డిజిటల్ డిమెన్షియా

అత్యవసర సందర్భాల్లో మొబైల్‌లో సన్నిహితులు, తెలిసినవారి ఫోన్ నంబర్లు ఏ పేరుతో సేవ్ చేసుకున్నది గుర్తుకు రాదు. మన ఫోన్‌నంబర్ తప్ప కుటుంబసభ్యులందరి ఫోన్‌నంబర్లు చెప్పలేని పరిస్థితి. చిన్నలెక్క వేయడానికి మెదడు గజిబిజిగా మారి సెల్‌ఫోన్‌లోని క్యాలిక్యులేటర్‌ను ఓపెన్ చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఇలాంటి సమస్యలు చాలా మందిని వేధిస్తున్నాయి. ఇది తరచూ జరుగుతూ ఉంటే మాత్రం 'డిజిటల్ డిమోన్షియా' అయ్యుండొచ్చని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

◆ రాయికల్, ఆంధ్రజ్యోతి



ప్రస్తుత సాంకేతిక ఆధిపత్య యుగంలో మొబైల్ ఫోన్, ట్యాబ్, కంప్యూటర్, టీవీ ఇతర సాంకేతిక పరికరాల వినియోగం పెరిగిపోయింది. ఫలితంగా ఒకప్పుడు సహజంగా కనిపించే డిమెన్షియా (చిత్త వైకల్యం) బారిన ఇప్పుడు చిన్న పిల్లలు, యువత పడుతున్నారు. దైనందిన జీవితంలో చాలా మంది మేల్కొని ఉండే సమయంలో 40 శాతం, ఆపై కూడా స్ర్కీన్ చూడటానికి కేటాయిస్తున్నారు. దీంతో ఆరోగ్యంపై తీవ్రప్రతకూల ప్రభావం పడుతోంది. ముఖ్యంగా చిన్నారుల్లో విజ్ఞానం, సృజనాత్మకతను సెల్‌ఫోన్లు చిదిమేస్తున్నాయి. సాధారణంగా 60 ఏళ్ల పైబడిన వృద్ధుల్లో డిమెన్షియా వస్తుంటుంది. సాంకేతికతను అతిగా వినియోగించడం ద్వారా జ్ఞాపక శక్తిలో వచ్చే సమస్యలను డిజిటల్ డిమెన్షియా అని 2012లో జర్మన్ న్యూరో శాస్త్రవేత్తలు అభివర్ణించారు. దీన్ని డిమెన్షియాకు ప్రారంభంలో వచ్చే మైల్డ్ కాగ్నిటివ్ ఇంపైర్‌మెంట్ అని కూడా కొందరు వైద్యులు చెబుతున్నారు. డిజిటల్ డిమెన్షియా మీద ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ఆధారంగా ఎక్కువ సమయాన్ని స్ర్కీన్‌కు కేటాయించడంతో జ్ఞాపక శక్తిపై ప్రభావం పడుతుందని తేలింది.

- జ్ఞాపక శక్తికి ముప్పు తెస్తున్న సెల్‌ఫోన్ అతి వినియోగం
- విద్యార్థులపై తీవ్ర ప్రభావం
- కుటుంబసభ్యుల ఫోన్ నంబర్లు సైతం చెప్పలేని పరిస్థితి
- చిన్నపాటి లెక్కలకు, తేదీల కోసం మొబైల్ తెరవాల్సిందే..

● మెదడు డీ యాక్టివ్

సాధారణంగా రాయడం, చదవడం, ఇంకా మరేదైనా పనుల్లో ఉన్నప్పుడు చుట్టూ ఏమి జరుగుతుందో కూడా తెలుస్తోంది. ఆ అంశాలను మెదడు యాక్టివ్‌గా పరిశీలిస్తూ ఉంటుంది. అదే మొబైల్ ఫోన్‌లో సోషల్ మీడియా, సినిమాలు చూడటం, వీడియో గేమ్స్ ఆడుతున్నపుడు పూర్తిగా అందులోనే నిమగ్నం అవుతారు. చుట్టూ ఏమి జరుగుతుందో కూడా గ్రహించకుండా మెదడు డీ యాక్టివ్ అయిపోతుంటుంది. ఈ నేపథ్యంలో గంటల తరబడి స్ర్కీన్ చూడటంతో మెదడు పనితీరుపై ప్రభావం పడుతోందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఇక చిన్నపిల్లల్లో అయితే ఆటిజం వంటి తీవ్ర దుష్ప్రభావాలు తలెత్తుతున్నట్లు వెల్లడిస్తున్నారు. కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో లాక్‌డౌన్ కారణంగా డిజిటల్ తరగతుల రూపంలో విద్యార్థుల్లో స్ర్కీన్ వినియోగం గణనీయంగా పెరిగింది. పాఠశాలలు, కళాశాలల్లో సైతం ప్రాజెక్ట్ వర్క్‌ల పేరిట ఇంటర్‌నెట్‌లో శోధించే అంశాలనే పిల్లలకు చెబుతున్నారు. ఇదికూడా జ్ఞాపకశక్తి మీద ప్రభావం చూపుతోంది.



ఇలా నివారించొచ్చు..

- మొబైల్, ల్యాప్‌టాప్, ఇతర డిజిటల్ స్ర్కీన్ వినియోగం తగ్గించాలి. సుదీర్ఘంగా స్ర్కీన్‌పై ఉండాల్సి వచ్చినప్పుడు మధ్యమధ్యలో విరామం తీసుకోవాలి.
- జ్ఞాపకశక్తి, మెదడుకు పనితీరుపై సానుకూల ప్రభావం చూపేలా వ్యాయామాలు చేయాలి.
- రోజుకు 7 నుంచి 8 గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి. తీపి పదార్థాలను ఎక్కువగా తీసుకోకూడదు. ఇదిమెదడు పనితీరుపై ప్రభావం చూపుతాయి.
- మద్యం సేవించడం, ధూమపానం విడనాడాలి.
- గ్రీన్ టీ, తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

మెదడు ఎదుగుదలపై ప్రభావం

– డాక్టర్ ఉదయ్‌కుమార్, ఎండీ



మాకు వస్తున్న 100 ఓపీల్లో 30-40 మొబైల్ అతివినియోగం ద్వారా వచ్చిన సమస్యలే ఉంటున్నాయి. సాధారణంగా చిన్నపిల్లల్లో ఐదున్నరేళ్ల వరకు మెదడు ఎదుగుతుంది. ప్రస్తుత రోజుల్లో పిల్లలు అల్లరి చేస్తున్నారని తల్లిదండ్రులు మొబైల్ ఇచ్చేస్తున్నారు. దీంతో చిన్నపిల్లల్లో మెదడు ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫోన్, టీవీల్లో చూసే కార్టూన్‌లు, గేమ్‌లనే వాస్తవ ప్రపంచంగా పిల్లలు భావిస్తున్నారు.

పసుపు బోర్డుతో రైతుల జీవితాల్లో వెలుగులు

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పసుపుబోర్డుతో రైతుల జీవితాల్లో వెలుగులు రాబోతు న్నాయని కేంద్ర హోంశాఖ సహాయంమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కరీంనగర్ నుంచి ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పసుపు బోర్డుతో ఈ ప్రాంత రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. పసుపు బోర్డుకు కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించనుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ఘనత బీజేపీదే అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందన్నారు. బోర్డు ఏర్పాటుతో రైతులకు మంచి రోజులు రాబోతున్నాయని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేసే అవకాశం దక్కుతుందన్నారు. పసుపు బోర్డు సాధించిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు, పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డికి, స్థానిక ఎమ్మెల్యేలు, రైతులకు బండి సంజయ్ కుమార్ అభినందనలు తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటుకు సహకరించిన కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌కు ధన్యవాదాలు తెలిపారు.



పసుపుబోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో వర్చువల్ ద్వారా పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ఢిల్లీలో ఎలబోతారం డప్పు కళాకారుల ప్రదర్శన

సైదాపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇంటిలో జరిగిన సంక్రాంతి వేడుకలల్లో సైదాపూర్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన డప్పు కళాకారులు పాల్గొన్నారు. తమ డప్పు వాయిద్యాలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. వీరి డప్పు వాయిద్యాలకు, ప్రదర్శనకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అభినందించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తన ఇంట్లో జరిగే సంక్రాంతి వేడుకలకు ఎలబోతారం డప్పు కళాకారులను ఆహ్వానించగా ఢిల్లీ వెళ్లి తమ కళను ప్రదర్శించారు.



ఎలబోతారం డప్పు కళాకారులకు అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

కన్నుల పండువగా రామలింగేశ్వరుడి కల్యాణం



ఆకట్టుకున్న మేకపొట్టేళ్ల బండి

- ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదక్షణ
- ప్రత్యేక ఆకర్షణగా మేకపోతుల బండి
- భారీ భద్రతా ఏర్పాట్లు

ఇల్లంతకుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలంలోని జంగమరెడ్డిపల్లె రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. ఏటా మూడు రోజులపాటు కొనసాగే ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉత్సవ మూర్తులకు కళ్యాణోత్సవం నిర్వహించారు. వివిద గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రెండవ రోజైన బుధవారం మండలంలోని వివిద గ్రామాల నుంచి వాహనాలలో వచ్చిన భక్తులు వాహనాలను ఆలయం చుట్టు తిప్పడానికి పోటీపడ్డారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ కమిటీ చర్యలు తీసుకుంది. సీఐ మొగిలి, ఎస్సై కదిరె శ్రీకాంత్ గౌడ్‌ల ఆధ్వర్యంలో 100మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీరామలింగేశ్వర స్వామి ఉత్సవాలకు యువకులు మద్యం సేవించి రావద్దని పోలీసులు ముందుగానే విస్తృతంగా ప్రచారం చేశారు. జాతరలో డ్రంక్‌అండ్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. అతివేగంగా వెళ్లిన వాహనదారులను పోలీసులు హెచ్చరించారు.

● ఆలయం చుట్టూ బండ్ల ప్రదక్షిణ

శ్రీరామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన బండ్ల ప్రదక్షణలో మేకపొట్టేళ్ల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండలంలోని కేసన్నపల్లె గ్రామానికి చెందిన కురుమ కులస్థుల ఆధ్వర్యంలో ప్రతిసంవత్సరం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. మేకపొట్టేళ్లబండితో ఫొటోలు దిగడానికి నాయకులు, యువకులు పోటీపడ్డారు.



ఆలయం చుట్టూ తిప్పుతున్న వాహనాలు

పరుగుల రామానుజమ్మకు మరో పతకం

సిరిసిల్ల టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పరుగుల రామానుజమ్మ ప్రతిభను కనబరిచి ఫస్ట్ సౌత్ ఆసియా మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలలో మరో పతకాన్ని కైవసం చేసుకుంది. బుధవారం సిరిసిల్లలో మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాభిమానులు రామానుజమ్మను అభినందనలు తెలిపారు. సౌత్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల కర్ణాటక రాష్ట్రం మంగళూరులో నిర్వహించిన ఫస్ట్ సౌత్ ఆసియా మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ - 2025 పోటీలలో పాల్గొన్న తమటం రామానుజమ్మ వయస్సు 70 ప్లస్ విభాగంలో అథ్లెటిక్స్ 800 పరుగు పందె పోటీలో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించింది. ఫస్ట్ సౌత్ ఆసియా మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని మొట్ట మొదటిసారిగా పతకాన్ని సాధించిన మహిళగా రామానుజమ్మ నిలిచింది. ఇప్పటికే రామానుజమ్మ పలు విభాగాల్లో పతకాలు సాధించారు.



రామానుజమ్మ

సంక్రాంతి రద్దీని పర్యవేక్షించిన ఆర్టీసీ ఆర్ఎం

భగత్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో బుధవారం సంక్రాంతి రద్దీని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు పర్యవేక్షించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంత ఊర్లకు వచ్చిన ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో వివిధ రూట్లలో బస్సలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రద్దీని బట్టి బస్సులను నడిపించాలని కరీంనగర్ బస్‌స్టేషన్ సంక్రాంతి రద్దీని పర్యవేక్షించిన ఆర్టీసీ ఆర్ఎం కస్టమర్ రిలేషన్ మేనేజర్ సురేష్‌కు సూచించారు. బస్‌స్టేషన్ ఆవరణలోని స్టాల్స్‌లో విక్రయించే వస్తువులను ఎమ్మార్పీకే అమ్మేలా చూడాలన్నారు. డిప్యూటి రీజినల్ మేనేజర్ ఎస్‌భూపతిరెడ్డి బస్‌స్టేషన్‌లో బస్సులను పర్యవేక్షించారు. ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారి దర్శనానికి క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది.వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కోడెమొక్కులను చెల్లించుకున్న అనంతరం స్వామివారి దర్శించుకొని తరించారు.

● స్వామి వారి సేవలో సినీనటుడు

శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని బుధవారం సినీనటుడు తిరువీర్ కుటుంభ సమేతంగా దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారి దర్శనం అనంతరం నాగిరెడ్డి మండపంలో వారికి ఆలయ అర్చకులు ప్రసాదాన్ని అందజేశారు.

విద్యాశాఖ కార్యదర్శిని కలిసిన ఎస్‌యూ వీసీ



యోగితారాణాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్

గణేశ్‌నగర్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ కార్యదర్శి డా.యోగితారాణాను బుధ వారం సచివాలయంలోని ఆమె కార్యాలయంలో శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం యూనివర్సిటీ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి చేయూత ఇవ్వాలని విద్యాశాఖ కార్యదర్శిని వీసీ ఉమేష్‌కుమార్ కోరారు.

ఆటల్లో ఆణిముత్యాలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

- ఆటేదైనా పతకం వారి సొంతం
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వారంతా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భావించి ఆటలపై ఆసక్తి పెంచుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడి మార్గదర్శకత్వంలో లక్ష్యం వైపు అడుగులేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణిస్తున్నారు. పాఠశాలకు చెందిన సుమారు 80 మంది విద్యార్థులు పట్టు వదలకుండా నిరంతరం సాధన చేస్తున్నారు. ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో వంటి క్రీడల్లో పతకాలు సాధిస్తున్నారు.



ఖో-ఖో ఆడుతున్న విద్యార్థినులు

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా

– కాయితి రోహిణి, 10వ, తరగతి, ఫుట్‌బాల్ క్రీడాకారిణి



మాది సిరిసిల్ల మండలం జగ్గారావుపల్లి. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా.పీడీ రవికుమార్ శిక్షణలో ఫుట్‌బాల్‌లో మెళకువలు నేర్చుకున్నా. రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటా. రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చాను. గతేడాది బీహార్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. క్రీడా విభాగంలో ఉద్యోగం సాధించి పల్లెల నుంచి క్రీడాకారులను తయారు చేస్తా.

వ్యాయామ ఉపాధ్యాయుడిగా..

– పిట్టల ప్రణయ్, 10వ, తరగతి, క్రీడాకారుడు



వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. 8వ తరగతి నుంచే వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడల్లో నైపుణ్యం పొందాను. మహబూబ్‌నగర్‌లోని జడ్చర్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చా. జాతీయ స్థాయిలో సత్తా చాటి వ్యాయమ ఉపాధ్యాయుడిగా రాణించాలన్నది నా కోరిక. మరి కొంత మంది విద్యార్థులను క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దుతా.

పట్టణ విద్యార్థులకు దీటుగా శిక్షణ

– దుప్పటి రవికుమార్, పీడీ



పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని ఆటల్లో మెళకువలను నేర్పిస్తున్నాం. పట్టణ ప్రాంత విద్యార్థులకు దీటుగా రాణించేలా తీర్చిదిద్దుతున్నాం. వారి ప్రతిభను గుర్తించి ఆ క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు.

ఐపీఎస్ అధికారిని అవుతా

– సందవేణి జశ్వంత్, 10వ, తరగతి, క్రీడాకారుడు



మాది ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామం. అమ్మా నాన్న వ్యవసాయ కూలీలు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. క్రీడలపై ఆసక్తి, ఉపాధ్యాయుల సూచనల మేరకు కబడ్డీ, ఫుట్‌బాల్‌లో మెళకువలు నేర్చుకున్నా. గతేడాది భద్రాద్రికొత్తగూడెంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాను. మెరుగైన ఆటతో రాష్ట్ర స్థాయిలో రాణించా. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ఐపీఎస్ అధికారిని అవుతాను.

చదువుతోపాటు ఆటల్లో మెళకువలు

– గరుగుల కృష్ణహరి, హెచ్ఎం



మా పాఠశాలలోని విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలతో మెళకువలను నేర్పిస్తున్నాం. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతున్నాం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ పంజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సాయికృష్ణ థియేటర్ ఏరియా, గీతా భవన్ ఏరియా, పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఏరియా, ముకరంపుర, జిల్లా పరిషత్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి

భగత్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరలోని 18వ డివిజన్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండిసంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీచర విష్ణు ప్రసాదరావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● అవీ.. ఇవీ

●కరీంనగర్ కల్చరల్: గుంటూరు జిల్లా పొనుగుపాడు గ్రామంలో ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి నాటికల పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన చీకటిపువ్వు నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించిందని సంస్థ అధ్యక్షుడు తిప్పర్తి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

●భగత్‌నగర్: రాష్ట్రీయ స్వయం సేవక్ ఉమ్మడి జిల్లా పూర్వ ప్రచారక్ చిట్టి గోపాల్‌రెడ్డి మరణం బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్‌లో వివేకానంద విద్యానికేతన్ విద్యాలయాన్ని స్థాపించి ఎందరికో విద్యను అందించారన్నారు.

●గణేశ్‌నగర్: సంక్రాంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కురుమ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు కడారి అయిలన్న, రాష్ట్ర కార్యదర్శి ఎల్కపెల్లి లచ్చయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మేకల నర్సయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

●కరీంనగర్ రూరల్: నగునూర్ గ్రామంలోని దుర్గా భవాని దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి పాల పంచాభిషేకాలు ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహిచారు.

●కరీంనగర్ మండల బీజేపీ అధ్యక్షుడిగా నగునూర్ గ్రామానికి చెందిన మాడిశెట్టి సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

●బొమ్మకల్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషల్ జిల్లా 320 జీ ఆధ్వర్యంలో ఇటుక బట్టీల వద్ద అన్న ప్రసాద ఇతరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్ కి షన్ పటేల్, రవి కంటి కృష్ణ, కిషోర్, రవీందర్ రెడి పాల్గొన్నారు.

●భగత్‌నగర్: వరంగల్ బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమరెడ్డి బుధవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి తనను అభ్యర్థిగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: చెన్నైలో ఈనెల 16 నుంచి 21వరకు నిర్వహించనున్న దక్షణ భారత అంతర యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు నిగమ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలకు చెందిన రిత్విక్‌సూర్య ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ సంపత్ తెలిపారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

హుజూరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేడుకలను మంగళవారం హుజూరాబాద్ డివిజన్‌లోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగకు మహిళలు ఉదయమే లేచి వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. మహిళలు ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు, నవ ధాన్యాలు, రేగు పండ్లు, గరిక, పిండిపువ్వులతో ఇంటి ముందు అలంకరించారు.


హుజూరాబాద్‌లో ఎడ్లబండ్ల ఊరేగింపు

●పట్టణంలోని హనుమాన్ దేవస్థానం చుట్టూ ప్రతాపవాడ, ఆరె వాడకు చెందిన ఎడ్లబండ్ల ప్రదక్షిణ నిర్వహించారు. ఈ బండ్లకు దేవతామూర్తుల చిత్రపటాలను ఉంచి వాటి ముందు డప్పుచప్పుళ్లు, వాయిద్యాలతో ఆయా భక్తులకు చెందిన ఇళ్ల నుంచి హనుమాన్ దేవస్థానం వరకు ఊరేగింపుగా చేరుకున్నారు. ఈ రథోత్సవాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ ఏర్పాట్లు చేశారు.

●శంకరపట్నం: మండలంలోసంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముగ్గుల వేసి వాటి మధ్య గొబ్బెమ్మలను పెట్టి నవధాన్యాలను పోశారు.

●సైదాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ప్రజలు సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో జరిగే వీరభద్రస్వామి జాతరకు ఎద్దుల బండ్లు, వాహనాల్లో భక్తులు తరలివెళ్లారు.

●మానకొండూర్: మండలంలోని వివిధ గ్రామాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎద్దులకు రంగులు పూసి కాటిరేవుల పండుగతో పాటు కనుమ పండుగను జరుపుకున్నారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో మకర సంక్రాతిని ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●జమ్మికుంట: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా భోగి, మకర సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా పతంగులు ఎగుర వేశారు.

●తిమ్మాపూర్: మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తిమ్మాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రామ్, నాయకులు పోలు రమేష్‌లు స్వీట్లు పంపిణీ చేశారు. రేణికుంటలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ మాజీ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, నాయకులు ఎలుక అంజనేయులు, ల్యాగల దేవేందర్ రెడ్డి, సంపత్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

●గన్నేరువరం: మండలంలోని ఖాసింపేట గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. మైలారం గ్రామంలో మాజీ వార్డుసభ్యుడు కాదసి కుమారస్వామి, అంబేద్కర్ యువ జన సంఘం ఆధ్వర్యంలో ముగ్గులు, కబడ్డీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

●వీణవంక: చల్లూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఏలే మధుసూదన్, ఎండి సోహేల్, కార్తీక్, నల్లవెల్లి సమ్మయ్య, బొంగుని రాజయ్య, తాండ్ర లక్ష్మణ్, బోడాసు సదయ్య తదితరులు ఉన్నారు.

●చిగురుమామిడి: చిన్న ముల్కనూరులో ఇండియన్ ఫార్మసీ కరీంనగర్, కయ్యం తిరుపతి మిత్ర బృందం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫార్మసీ నిర్వాహకులు నారాయణ, ప్రవీణ్, రాము, ఆర్గనైజర్లు, ఈశ్వర్, చంద్రశేఖర్, శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

24న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

కరీంనగర్ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో భాగంగా అభివృద్ధి పనులకు ఈనెల 24న కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రారంభోత్సవాలు చేస్తారని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. అవసరమైన సభాస్థలితో పాటు ఇతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని మేయర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, ఇతర అధికారులతో కలిసి హౌజింగ్‌బోర్డుకాలనీలో పర్యటించిన సభాస్థలి ఏర్పాట్లపై కమిషనర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీలో అభివృద్ధి చేసిన మల్టిపర్పస్ పార్కు, అంబేద్కర్ స్టేడియంలోని స్పోర్ట్స్ కమర్షియల్ కాంప్లెంక్సు, ప్రభుత్వ పాఠశాలల్లోని ఈ క్లాస్ రూమ్స్, ఆధునీకరణ, హౌజింగ్‌బోర్డుకాలనీలో ప్రయోగాత్మకంగా చేపట్టనున్న 24/7 మంచినీటి సరఫరా పథకాలను కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్‌కట్టర్, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేస్తామని మేయర్ సునీల్‌రావు చెప్పారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్, డీఈ ఓం ప్రకాశ్, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

కరీంనగర్ క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా జైలుకు ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులు, వివిధ రకాల స్టీల్ ఫర్నిచర్ సరఫరాకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు టెండరు ఫారంలను సమర్పించేం దుకు ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జైలు వద్ద సంప్రదించాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న టెండర్లు ఖరారు చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9494632431 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్వశక్తి సంఘాల సభ్యులకు బీమా

-ప్రమాదంలో మృతిచెందితే రూ.10లక్షల పరిహారం

కరీంనగర్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వశక్తి సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం బీమా సదుపాయం కల్పిస్తోంది. కరీంనగర్ మండలంలో 898 మంది స్వశక్తి సంఘాల్లో మొత్తం 10,487 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం స్వశక్తి సంఘం సభ్యులకు ఉచితంగా రెండు రకాల బీమా సౌకర్యం కల్పిస్తుంది. ప్రతి సభ్యురాలికి లోన్ బీమాతో పాటు ప్రమాద బీమా సదుపాయం కల్పించింది. సురక్ష పథకంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది. సభ్యుల వయస్సు 60 సంవత్సరాలలోపు ఉండాలి. ఈ ఏడాది మార్చి 14 నుంచి వచ్చే ఏడాది మార్చి 13 వరకు బీమా సౌకర్యం వస్తుంది. సంఘం సభ్యురాలు ప్రమాదంలో మృతిచెందితే ఆ కుటుంబానికి 10లక్షల బీమా ప్రభుత్వమే చెల్లిస్తుంది. గతంలో ఎవరైనా రుణం తీసుకున్న సభ్యురాలు మృతిచెందితే మిగతా వాయిదాలు చెల్లించాలని ఆ కుటుంబంపై సభ్యులు ఒత్తిడి చేసేవారు. ప్రస్తుతం ప్రమాద బీమా నుంచి చెల్లించే అవకాశం ఉంది. రుణం వాయిదా డబ్బులు మినహాయించుకొని మిగతా సొమ్మును నామినికి అందజేస్తారు. సభ్యురాలు సాధారణంగా మృతిచెందితే ఆ కుటుంబానికి 2లక్షల బీమా చెల్లిస్తారు. బకాయి ఉంటే అవి పట్టుకుని మిగతా డబ్బులు కుటుంబ సభ్యులకు అందజేస్తారు.


మొగ్దుంపూర్ సమావేశమైన స్వశక్తి సంఘాల మహిళలు(ఫైల్)

సంఘాలకు ఎంతో ప్రయోజనం
-ఐకేపీ ఏపీఎం, భార్గవ్



బీమా పథకంతో స్వశక్తి సంఘాల మహిళలకు ప్రయోజనం కలగనుంది. ఇటీవల మృతి చెందిన నలుగురు సభ్యుల వివరాలు ఉన్నతాధికారులకు అందజేశాం. బీమా సొమ్ములో సభ్యుల బకాయిలు పట్టుకుని మిగతాది నామినీకి అందజేస్తాం.

రేషన్‌కార్డుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్‌భాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో రేషన్‌కార్డుల సర్వేను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన వారిని గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో కొత్త రేషన్‌కార్డుల జారీపై అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి సర్వేపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, నిబంధనల మేరకు ఇచ్చిన డేటాకు అనుగుణంగా కొత్త రేషన్‌కార్డుల సర్వేను గురువారం నుంచి ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సువార్త, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, సివిల్ సప్లయి అధికారి నర్సింగారావు, వార్డు ఆఫీసర్లు, మెప్మా సీవో పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

కరీంనగర్ టౌన్, జనవరి 15:విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆర్ట్స్ ఫిజికల్ వర్క్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాడూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన సంక్రాంతి సిత్రాల పోటీల బహుమతుల ప్రదానోత్సవం బుధవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యా తిరునగరి, ఉపాధ్యక్షుడు చేపూరి గోపాల్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపికచేసినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గీతారాణి, విజయలక్ష్మి, జ్యోతి, అనిత, రౌతు రవికుమార్, సంపత్, రమేశ్, అనిల్‌కుమార్, కేశవకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు రూ.25వేల ఆర్థిక సహాయం

కరీంనగర్ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి, గంగాధర కేజీబీవీల్లో టెడ్ ఎడ్ టాక్‌లో చేరి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.25వేల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ పమేలా సత్పతి అందజేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో చొప్పదండి కేజీబీవీ విద్యార్థినీ ఎం.శ్రీహిత (పది), పి.సింధూజ (తొమ్మిది)లకు ఉన్నత విద్యనభ్యసించాలని సూచిస్తూ ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో దేవంపల్లి జీహెచ్‌ఎం వివి.సత్యనారాయణ, గంగాధర ఎంఈవో ఏనుగు ప్రభాకర్‌రావు, జీసీడీవో కృపారాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలి'

కరీంనగర్ అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తోటి ఎమ్మెల్యేను దూషించిన కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్టీసీ ఈడీ

భగత్‌నగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్‌ఎం బి రాజు, డిప్యూటి ఆర్‌ఎం భూపతిరెడ్డి పాల్గొన్నారు.

పార్కుల నిర్వహణ కాంట్రాక్టు ఖరారు

కరీంనగర్ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టిన మహాత్మాజ్యోతిబాపూలే, మల్టీపర్పస్ పార్కుల నిర్వహణ టెండర్ల బాక్సులను తెరచి కాంట్రాక్టును మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఖరారు చేశారు. జ్యోతిబాపూలే పార్కును ఎస్‌ఆర్ డెకోరేషన్, మల్టీపర్పస్ పార్కును కిరణ్ అనే కాంట్రాక్టర్లు పొందినట్లు ప్రకటించారు.

'క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట'

భగత్‌నగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తున్నదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం అన్నారు. కొత్తపల్లి పట్టణంలో మూడు రోజులుగా బాపూజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందించారు. విజేతలకు ఐదు వేల రూపాయలు, రన్నరప్‌కు 3వేల రూపాయలతో పాటు, ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో బాపూజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు పొన్నం సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

ఇల్లందకుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పుల్లయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలపై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పోలెపాక రాణి, వ్యవసాయాధికారి ముప్పిడి సూర్యనారాయణ ఉన్నారు.

ఎమ్మెస్సార్‌కు ఘన నివాళి

గణేశ్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెస్సార్ జయంతి సందర్భంగా నగరంలోని కార్ఖానగడ్డ వృద్ధుల ఆశ్రమంలో బొబ్బిలి విక్టర్ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మాతా శిశు ఆసుపత్రిలో మైనార్టీ నాయకులు సాదిక్, వాజిద్, సమీర్ ఆధ్వ ర్యంలో అన్నదానం నిర్వహించారు. నగరంలోని వీరబ్రహేంద్ర అనాథ ఆశ్రమానికి యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు సిరిపురం లావణ్య కూలర్లు అందజేశారు.

● జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ దేవాదాయశాఖ మంత్రి ఎమ్మెస్సార్, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి జయంతి మంగళవారం ఘణంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు పరుశురామరావు, మహిళ పట్టణ అధ్యక్షురాలు పూదరి రేణుక-శివగౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిధుల మంజూరు కోసం వినతి

గన్నేరువరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆ సంఘం మండల నాయ కులు వినతిపత్రం అందజేశారు. సంఘం భవన నిర్మాణానికి ఆయన సానుకూ లంగా స్పందించారని మున్నూరుకాపు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు బాలయ్య, కొట్టె భూమయ్య, పుల్లెల రాము, కొలుపుల వేణు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన


సింగాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వేణు

హుజూరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలో రోడ్డు భద్రత వారోత్సవాలపై ఎంవీఐ కంచి వేణు బుధవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. వాహనాలు నడిపే టప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగరాజు, ఆటో డ్రైవర్లు భద్రస్వామి, కుమార్, రాకేష్, శ్రీనివాస్, రోహిత్, కొంరయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు


పోలీస్‌ల అదుపులో జమ్మికుంట బీఆర్‌ఎస్ నాయకులు

హుజూరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయడంతో ముందస్తుగా హుజూరాబాద్ బీఆర్‌ఎస్ నాయకులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అరెస్టు అయిన వారిలో బి. శ్రీనివాస్, రవీందర్‌రావు, కొండాల్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, శంకర్, అమ్జద్ తదితరులు ఉన్నారు.

● జమ్మికుంట రూరల్ : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు సందర్భంగా జమ్మికుంట బీఆర్‌ఎస్ నాయకులను మంగళవారం తెల్లవారు జామున పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే తమ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తోందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన తమ నాయకుడు వెనుకడుగు వేయబోడని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాడని గుర్తుంచుకోవాలన్నారు. పట్టణ అధ్యక్షులు టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జుగురు సదానందం, పొనగంటి మల్లయ్య, మొగిలయ్యను అదుపులోకి తీసుకున్నారు.

● చిగురుమామిడి: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. మంగళవారం తెల్లవారు జామున బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముందస్తుగా అరెస్ట్ చేసిన వారిలో మండల నాయకులు ఆకవరం శివప్రసాద్, ఎండి సర్వర్ పాషా, పెసరి రాజేశం, బోయిని శ్రీనివాస్, సన్నీల వెంకటేశం, దుడ్డెల లక్ష్మీనారాయణ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

తిమ్మాపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలో మాతంగి కాంతమ్మ, మల్లయ్య స్మారకార్థం మాతంగి శంకర్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న తిమ్మాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూర్ నియోజకవర్గం అధ్యక్షుడు ఎడ్ల జోగిరెడ్డి బహుమతులతో పాటు నగదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాతంగి శంకర్, నాయకులు ఎడ్ల రాజిరెడ్డి, జక్కుల కుమార్, చిలుకూరి అనిల్, బొర్ర వంశీ, పోతురాజు దేవేందర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీ చింపివేత

వీణవంక, జనవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారెడ్డిపల్లిలో ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ తరపున ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. బుధవారం మల్లారెడ్డిపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖాధ్యక్షుడు నిమ్మల సమ్మయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హుజూరాబాద్‌లో మాదిగల కళా ప్రదర్శన

హుజూరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వెయ్యి గొంతుకల... లక్ష డప్పుల మాదిగల ప్రదర్శన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతుకల... లక్ష డప్పుల మాదిగల మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాకారుడు రామంచ భరత్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్ రామచంద్రం, ఏ ప్రభు, బాబు, ఆర్ రాజేశ్వర్, ఎం శ్రీనివాస్, బి అనిల్, వసంత్, రవీందర్, శేఖర్, ఈ సమ్మయ్య, ప్రభాకర్, అయిలయ్య, రాజలింగం పాల్గొన్నారు.


హుజూరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ కళాప్రదర్శన

కౌశిక్‌రెడ్డి చర్యలతో ఇబ్బందుల్లో నియోజకవర్గ ప్రజలు

జమ్మికుంట రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చర్యలతో నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు వాసాల రామస్వామి అన్నారు. బుధవారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓట్లు పడుతాయో లేదో అన్న ఉద్దేశ్యంతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీని సెలవుల్లో పంపి రెండవ విడుత ఆపించిన వ్యక్తి కౌశిక్‌రెడ్డి అని ఆరోపించారు. దళితబంధు అనేది కేవలం ఈటల రాజేందర్ రాజీనామా చేయడం వల్ల వచ్చిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిపించకుంటే ఆత్మహత్య చేసుకుంటామని అంటే ప్రజలు గెలిపించారే తప్ప మరొకటి లేదన్నారు. సమావేశంలో నాయకులు చిలివేరి రాజమౌళి, మేకమల్ల వెంకటేష్, రాచపల్లి సాగర్, రాచపల్లి గణేష్, కుమార్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

●ఇల్లందకుంట: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన వరుకూటి మదన్‌రావును కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా నియమిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఉత్తర్వులు అందజేశారు.

●తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో డి-4 కెనాల్ కాలువకు గండిపడి గ్రామంలోని పలు ఇండ్లలోని వరద నీరు వచ్చి నిత్యవసర సరుకులు, ఇతర వస్తువులు నీటి మునిగాయి. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రావులు రమేష్ బాధిత 30 కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు.

● రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామం నుంచి గంగాధర వరకు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం కాగా బుధవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో దేశరాజుపల్లె మాజీ సర్పంచ్ కోలే రమేష్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి ముదిరాజ్ ఉన్నారు.

● చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు, మాజీ సర్పంచ్ చెప్యాల వేణు(40) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. సీపీఐ మండలశాఖ ఆధ్వర్యంలో వేణు మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

●గన్నేరువరం: రాష్ట్ర ప్రభుత్వం చేనేత, మరమగ్గాల అనుబంధ కార్మికులకు అభయహస్తం కింద నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా పథకాల అమలుకు జీవో జారీ చేయడాన్ని హర్షిస్తూ జంగపల్లిలో మార్కండేయ ఆలయం వద్ద పద్మశాలీలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

● హుజూరాబాద్: పట్టణం కేసీ క్యాంపులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదాదేవి రంగనాథుల స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు గణపతిరెడ్డి, అర్చకులు నందకిశోరాచార్యులు, సుదర్శన్‌చార్యులు ఉన్నారు.

● గంగాధర: ప్రభుత్వ పథకాల ఎంపికలో నిబంధనల ప్రకారం చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం సమావేశం నిర్వహించారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.